క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన సువ్వాడ గణేష్ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలను గ్రామంలో మార్కెట్ స్టాల్ వద్ద సోమవారం ప్రదర్శించడంతో పాటు అమ్మకాలు జరిపారు. ప్రతి సోమవారం కూరగాయల స్టాల్ ఏర్పాటు చేస్తున్నట్లు రైతు గణేష్ తెలిపారు.

గోశాల బిల్లులు చెల్లించాలి



అర్జీని స్వీకరిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో నిర్మించిన గోశాలల బిల్లులు చెల్లించాలని కోరుతూ లబ్ధిదారులు కోరుతూ సోమవారం వినతిపత్రం అందజేసినట్లు ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు తెలిపారు. ప్రజా సమస్యలపరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉన్న చిన్న సమస్యలతో వచ్చిన వినతులను అక్కడిక్కడే పరిష్కరించినట్లు చెప్పారు.

డీలర్ల ఎంపికకు పరీక్ష నిర్వహణ



డీలర్ల రాతపరీక్షను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం డివిజన్‌లో చౌకదారుల దుకాణాల డీలర్ల ఎంపికకు రాతపరీక్షను సోమవారం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ పరీక్షలను నిర్వహించగా పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పరిశీలించారు. డివిజన్‌లో 36 చౌకదారుల దుకాణ డీలర్ల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నోటిఫికేషన్ ఆధారంగా 285 దరఖాస్తులు అందాయి. వాటిలో 63తిరస్కరణకు గురికాగా, 222దరఖాస్తులను అంగీకరించారు. రాత పరీక్షలకు 202 మంది హాజరు కాగా 20మంది గైర్హాజరయ్యారు.

నిత్యావసర సరుకులు సకాలంలో పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఉమామహేశ్వరరావు

సీతానగరం: మండలంలోని వినియోగ దారులకు సకాలంలో నిత్యావసరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ ఎ.ఉమామహేశ్వరరావు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌షాపు డీలర్లు, సరుకుల పంపిణీ వాహన యజమానులతో నిత్యావసర సరుకుల పంపిణీ విధానంపై సోమవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన నిత్యావసర సరుకులను మండలంలోని రేషన్ వినియోగదారులు, అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన నిర్వాహకు లకు నిర్దేశించిన గడువులోగా పంపిణీ చేయాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా సరుకులు వాహనాలతో ఇంటింటికీ పంపిణీ చేయాలని స్పష్టం చేశారు.

27న విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ ర్యాలీ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస: విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ ఈ నెల 27వ తేదీన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు సోమవారం తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ శ్రేణులు, ప్రజలతో కలిసి ర్యాలీగా వెళ్లి, ఏఈ లేదా డీఈని కలిసి వినతిపత్రం అందించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ వైఖరిపై నిరసన చేపట్టనున్నామన్నారు. అనంతరం చినమేరంగి గ్రామంలోని తన నివాసంలో కార్యక్రమ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

చివరికి అంతేనా..!

- రైతుల్లో తుఫాన్ కలవరం
- ఇంకా పొలాల్లోనే 75 శాతం సీడ్ ధాన్యం
- ఏపీ సీడ్స్‌కు చేరింది 10వేల క్వింటాల్స్ మాత్రమే
- చేరాల్సింది 30 వేల క్వింటాల్స్



ఒక వైపు మబ్బులు, మరోవైపు యంత్రాలతో కోత

సాలూరు రూరల్:

ఈ ఏడాది రైతులను తుఫాన్ హెచ్చరికలు క్షణ క్షణం భయాందోళనకు గురి చేస్తూనే ఉన్నాయి. ఎప్పుడు వర్షం పడుతుందోనన్న భయం వారిని పట్టి పీడిస్తోంది. తొలివిడత తుఫాన్‌తో కోసిన చేలు మడుల్లోనే తడిసి ముద్దయ్యాయి. మలి విడత తుఫాన్ ప్రభావంతో మూడు రోజుల పాటు కురిసిన ఎడతెరిపి లేని వర్షంతో కళ్లాల్లో కుప్పలు వేసిన ధాన్యం, పొలాల్లో కుప్పలు వేసిన చేలు తడిసి చాలావరకు మొలకలు వచ్చేయడంతో వాటిని ఎలా అమ్ముకోవాలో తెలియని పరిస్థితి రైతులది. ఇదిలా ఉండగా సీడ్ ధాన్యం వేసిన రైతులు ప్రస్తుతం మరో సమస్యను ఎదుర్కొంటున్నారు.

ఏపీ సీడ్స్‌కు 75 శాతం ధాన్యం చేరాలి

మండలంలోని జనవరి వలస వద్ద గల ఏపీ సీడ్స్ రైతులకు ఈ ఏడాది 1800 ఎకరాలకు విత్తనాలు సరఫరా చేసింది. అయితే ఇప్పటి వరకు 25 శాతం మాత్రమే సీడ్ ధాన్యం ఏపీ సీడ్స్‌కి చేరాయి. ఇంకా మిగిలిన 75 శాతం ధాన్యం చేరాల్సి ఉంది. సాలూరు మండలంలో సీడ్ ధాన్యం ఎక్కువగా బంగారమ్మ పేట, కరకవలస, కూర్మరాజుపేట గ్రామాలలో రైతులు పండించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇప్పటికీ వరిచేలు నీటిలోనే తేలియాడుతున్నాయి. అలాగే కొన్నిచేలు నేలకొరిగాయి. కోయడానికి కూడా వీలు కాని పరిస్థితుల్లో మళ్లీ తుఫాన్ హెచ్చరికలు రైతులకు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.



నీటిలో మునిగిన వరి వెన్నులు కోస్తున్న మహిళలు

నీట మునిగిన సీడ్ ధాన్యం



నాలుగు ఎకరాల్లో సీడ్ ధాన్యం వేశాం. ఇప్పటికే కోసి ఏపీ సీడ్స్‌కి తరలించాల్సింది. తుఫాన్ కారణంగా ఆలస్యమైంది. కొంత చేను నీట మునిగింది. తడిసిన ధాన్యం కొనకపోతే దళారులకు అమ్ముకోవాల్సిందే. సీడ్ ధాన్యానికి ప్రత్యేక శ్రద్ధతో అధిక పెట్టుబడులు పెట్టాం. కౌలు ఇవ్వాలి. మదుపులు తీయాలి. మాకు మిగిలేది ఏమీ ఉండదు. ఈ ఏడాది ప్రభుత్వ సాయం కూడా అందలేదు.

గోర లక్ష్మి, వరి రైతు కరకవలస, సాలూరు మండలం

దీంతో బంగారమ్మ పేట, కరకవలస గ్రామాల్లో యంతాల సహాయంతో కోతలు కోస్తున్నారు. నేలకొరిగిన చేను కూలీలతో కోయిస్తున్నారు. ఇలా రైతులు వారి పంటను ఇంటికి చేర్చేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అయితే సీడ్ ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉంటే అవి విత్తనాలకు పనికి రావు. దీంతో ఈ ఏడాది విత్తన కొరత ఏర్పడే ప్రమాదం కూడా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం వాతావరణం మబ్బులు కాయడంతో ధాన్యం పోగుల వద్ద రైతులు దీనంగా కూర్చుని విచారిస్తున్న పరిస్థితి కనిపించింది.



కళ్లాల్లోనే కప్పి ఉన్న ధాన్యం



నేలకొరిగి నీటిలోనే ఉన్న వరిచేలు

పెండింగ్ ఈ చలానాలు చెల్లించాలి



వాహనాల ఈ చలానా బాకీలను పరిశీలిస్తున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: వాహన యజమానుల వద్ద పెండింగ్‌లో ఉన్న అపరాధరుసుం తక్షణమే చెల్లించాలని ఎస్సై ఎం.రాజేష్ కోరారు. ఈ మేరకు మండలకేంద్రంలోని హనుమాన్‌జంక్షన్ వద్ద సోమవారం ఆయన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలుప్రాంతాల వాహన యజమానులు వాహనాలు తిరుగాడే సమయంలో పోలీస్‌శాఖ ఇదివరలో తనిఖీ చేసి చలానా విధానం ద్వారా అపరాధరుసుం విధించినప్పటికీ వాహన యజమానులు అపదరాధ రుసుం దీర్ఘకాలం నుంచి ఇంతవరకూ చెల్లించకపోవడం వల్ల పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అప్పట్లో కట్టాల్సిన ఈ చలానాలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించక పోవడంతో తాజాగా వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. వాహనాలు తనిఖీ చేసే సమయంలో పెండింగ్‌లోఉన్న ఈ చలానాలు తక్షణమే చెల్లించాలని లేనిపక్షంలో అపరాధరుసుం చెల్లించినంతవరకూ వాహనాలను అదుపులోకి తీసుకుంటామని తెలియ జేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



పూనుబుచ్చింపేటలో త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సీతానగరం: మండలంలో త్రైతసిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచార కార్యక్రమం చురుగ్గా జరుగుతోందని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక బొబ్బిలి కమిటీ అధ్యక్షుడు సీహెచ్ అప్పలనాయుడు అన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని కేఎస్ పురం, పూనుబుచ్చింపేట, జానుమల్లువలస గ్రామాల్లో ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుర్మాసం, మార్గశిరమాసాన్ని పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి జ్ఞాన వేదిక ద్వారా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను అవిష్కరిస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రైతులకు సత్కారం



రైతులను సత్కరిస్తున్న డాక్టర్ జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు బందలుప్పి, ఎమ్మార్‌నగరం గ్రామ పరిసరాల్లో రైతులను సోమవారం దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనకు జీవనాధారమైన ఆహారం రైతు కష్టపడి వ్యవసాయం చేస్తూ మనకు అందిస్తున్నాడని, గ్రామీణ శ్రేయస్సుకు గణనీయమైన సహకారి రైతులని, రైతే దేశానికి వెన్నెముక అని కొనియాడుతూ రైతులను ప్రతి ఒక్కరూ ఆదరించి ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. సమాజానికి చేసే కృషికి బాధ్యత వహిస్తున్న రైతులందరినీ గౌరవించడం, ప్రశంసించడం కోసం ప్రతి సంవత్సరం డిసెంబర్ 23వ తేదీన జాతీయ రైతు దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. సాధ్యమైనంతవరకు సేంద్రీయ ఎరువులతో పంటలలు పండిచడం వల్ల మానవాళి ఆరోగ్యానికి ఎంతో దోహదపడినవారవుతారని, ప్రతి ఒక్కరూ వ్యవసాయం ఆవశ్యకతపై అవగాహన కలిగి ఉండాలని, తాను కూడా వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చానని డాక్టర్ జగన్‌మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా వారికి పలు ఆరోగ్య సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ఈఓ సత్తిబాబు, సూపర్‌వైజర్ జయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



ద్విచక్ర వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటరమణమూర్తి

మక్కువ: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరిచాలని ఎస్సై ఎం.వెంకటరమణమూర్తి అన్నారు. ఈ మేరకు స్థానిక చర్చి జంక్షన్ వద్ద సోమవారం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. వాహన పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని, హెల్మెట్ ధరిస్తే ప్రయాణం సురక్షితమవుతుందన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహన పత్రాలు లేని వారికి చలానా విధిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎస్సై శ్రీనివాసరావు, సీఆర్పీఎఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వసతిగృహాల్లో సిక్‌రూమ్ తప్పనిసరి



బాలికల వసతిగృహాన్ని సందర్శిస్తున్న మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ

కొమరాడ: విద్యార్థుల వసతిగృహాల్లో సిక్‌రూమ్‌లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల వసతిగృహాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల చదువుతో పాటు వారి ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులంతా బాగా చదువుకోవాలని, దోమల బారినపడకుండా దోమతెరలు వాడాలని, ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. జర్వం లక్షణాలు కనిపిస్తే వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. వసతిగృహాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయాలన్నారు.

నేడు పీసా గ్రామసభలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలో మొత్తం 27 పంచాయతీలు ఉండగా, వాటిలో 26 పంచాయతీల్లో పీసా గ్రామసభలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. పీసా చట్టం అమల్లోకి వచ్చిన సందర్భంగా పంచాయతీల్లో సర్పంచ్, కార్యదర్శిల అధ్యక్షతన స్థానిక స్వపరిపాలనకు పునరుజ్జీవానికి, గిరిజనుల హక్కుల చట్టబద్ధతకు రక్షణ వాతావరణాన్ని పెంపొందించడానికి ఈ సభలు నిర్వహించడం జరుగుతోందన్నారు.

పాఠశాలకు ఉపాధ్యాయుడి డుమ్మా



తాళాలు వేసి ఉన్న కె. కొత్తవలస పాఠశాల



రోడ్లపై యూనిఫామ్‌తో ఆడుకుంటున్న విద్యార్థులు

- ఆటలకే పరిమితమైన విద్యార్థులు

సాలూరు రూరల్: మండలంలోని కె.కొత్తవలసలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు డుమ్మా కొట్టడంతో సోమవారం పాఠశాల తెరుచుకోలేదు. దీంతో ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉపాధ్యాయుడు వస్తాడని ఎదురు చూసిచూసి పాఠశాల సమయం దాటిపోవడంతో ఇళ్లకు వెళ్లి పుస్తకాలు ఇంటి దగ్గర విడిచిపెట్టి గ్రామంలో రోడ్లపై ఆటలాడుకోవడం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు ఎప్పటికప్పుడు ఇలాగే చేస్తుంటారని, అడిగేవారు లేకపోవడంతో తమ పిల్లలు విద్యకు దూరమవుతున్నారని వాపోతున్నారు. ఈ విషయంలో చేలాసార్లు ఉపాధ్యాయుడిని ప్రశ్నించినప్పటికీ ఇలాగే చేస్తుంటారని గ్రామస్తులు చెబుతున్నారు.

చిన్ననోటు లేక పదింతల కష్టం

- మార్కెట్‌లో తగ్గిన రూ.10నోట్ల చలామణి
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



పదిరూపాయల నోట్లు

బలిజిపేట: పది రూపాయల నోటు చిన్నదే అయినా ప్రతి ఒక్కరికి చాలా అవసరం. ప్రస్తుతం మార్కెట్‌లో వాటి చలామణి తక్కువగా అవుతుండడంతో వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చలామణిలో చిరిగిన, బాగా దెబ్బతిన్న నోట్లు తప్ప కొత్తవి రావడం లేదు. ప్రస్తుతం మార్కెట్‌లో చలామణి అవుతున్న నోట్లు జేబులో పెట్టుకుంటే చిరిగిపోయిన పరిస్థితులు ఉన్నాయి. నిరక్షరాస్యులైన వ్యాపారులు, ప్రజలు చిరిగిపోయిన నోట్లను పుచ్చుకునేందుకు ఇష్టపడకపోవడంతో అన్ని వర్గాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో 1, 2, 5రూపాయల నాణాలు ఉన్నా వాటిలో 5రూపాయల నాణెం వినియోగం పెరిగిపోయింది. 10రూపాయల నాణెం ఉన్నా పెద్దగా చలామణిలో లేదు. వాటితో పాటు రూ.10నోట్ల చెలామణి భారీగా తగ్గింది. చిరువ్యాపారులు, కూరగాయల దుకాణాలు, చిన్నచిన్న హోటళ్లు, టీకొట్లు, ఆటోలు, బస్సులలో రూ.10నోట్ల వినియోగం పెరిగింది. అందుకు తగిన విధంగా ఆ నోట్లు అందుబాటులో లేకపోవడం కష్టంగా ఉందని ప్రజలు చెబుతున్నారు. రూ.20నోట్ల చలామణి ఉన్నంతగా పదినోట్లు కనిపించడం లేదని వ్యాపారులు అంటున్నారు. రూ.100నోటు ఇస్తే వ్యాపారులు తిరిగి చిల్లర ఇచ్చేందుకు నానా తంటాలు పడుతున్నారు. అప్పటికీ డిజిటల్ చెల్లింపులు చలామణిలో ఉన్నప్పటికీ కొంతమంది వాటిని వినియోగిస్తుండగా, మరికొంతమంది వాటి వినియోగంలో అనుమానపడుతున్నారు. బస్సులలో ప్రయాణించేటప్పుడు యూపీఐలద్వారా చెల్లింపులు చేయాలన్నా కండక్టర్ వద్ద ఉండే ఆర్టీసీ యాప్ సక్రమంగా పనిచేయడం లేదని, ఆ సమయంలో చిల్లర సమస్య వేధిస్తోందని ప్రయాణికులు చెబుతున్నారు. కొన్ని సమయాల్లో సర్వర్లు డౌన్ అవడంతో యూపీఐ చెల్లింపులలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చిల్లర సమస్య ఉందని భావించిన కొందరు రూ.10నోట్లను చాలావరకు వారి అవసరాలకు ఎప్పుడైనా ఉపయోగపడతాయని భద్రపరుచుకుంటున్నారని దీనివల్ల కొరత ఎక్కువగా ఉంటోందని భావిస్తున్నారు. బ్యాంకుల ద్వారా రూ.10, 20నోట్లు విరివిగా విడుదల చేసి చిల్లర సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. వ్యాపారలావాదేవీలకు అంతరాయం కలగకుండా చూడాలని కోరుతున్నారు.

సైబర్ నేరాల నివారణకు సహకరించాలి



పెదభోగిలిలో మాట్లాడుతున్న ఏఎస్సై ఎల్. శ్రీనివాసరావు

సీతానగరం: పట్టణాలు, గ్రామాల్లో జరుగుతున్న సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు, మాదక ద్రవ్యాల విక్రయం నిరోధించడానికి ప్రజలు సహకరించాలని ఏఎస్సై లంక శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన సీతానగరం మండలంలోని పెదభోగిలిలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మాట్లాడుతూ ఆన్‌లైన్ విధానం ద్వారా ఫోన్‌లింక్‌లతో సైబర్ నేరాలు జరుగుతున్న కారణంగా తమ ఫోన్‌లో వచ్చిన ఓటీపీ నంబర్ ఎవరికీ తెలియజేయరాదని సూచించారు. వాహన చోదకులు హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడుపుతూ ప్రమాదాల్లో తలకుబలమైన గాయాలై ప్రాణాపాయం కొనితెచ్చుకుంటున్నారని, ద్విచక్ర వాహనాలతో ప్రయాణం చేస్తున్నవారంతా విధిగా హెల్మెట్ ధరించాలని హితవు పలికారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో వివిధ రకాల వ్యాధులకు బారిన పడి అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. గ్రామాల్లో అవగాహన కల్పించడానికి సంకల్పం సదస్సులు దోహదపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం..

పాలకొండ రూరల్:



అపర్ణకు పది వేల రూపాయలు అందిస్తున్న ఉపాధ్యాయుడు దిలీప్‌కుమార్, తదితరులు

పట్టణంలోని నాగవంశపు వీధికి చెందిన ఆనాపు అపర్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రాణాపాయస్థితి నుంచి కోలుకున్నా కంటికి శస్త్రచికిత్స చేయాల్సి ఉంది. అయితే ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న అపర్ణ పరిస్థితి తెలుసుకున్న పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు కుమిలి దిలీప్‌కుమార్ తన స్నేహితుల సహకారంతో రూ. పది వేలు సేకరించి సోమవారం బాధితురాలికి అందజేశారు. ఈయన వెంట వారణాశి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.